జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ గురువారం 11 జూన్ 2026 సంపుటి : 16 సంచిక : 131 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528




# ఎరువుల ధరలకు రెక్కలు

## పెరిగిన విత్తన, ఎరువుల ధరలు

## రైతన్నపై మోయలేనిభారం.. ఆందోళనలో అన్నదాతలు

బాన్సువాడ

వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగంపై ధరల మోత మోగుతున్నది. ఇటు ఎరువులు, అటు విత్తనాల రేట్లు పెరగడంతో పెనుభారం పడుతున్నది. సీజన్ ఆరంభానికి ముందే విత్తనాలు, ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది. జీలుగు వంటి విత్తనాల రేట్లు సైతం పెంచడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే యూరియా దొరకక, యా సంగికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాక అన్నదాతలు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఇలాంటి తరుణంలో ధరల దరువు వారిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నది. వ్యవసాయ భూములు సారవంతంగా మారడానికి రైతులు వానకాలం ఆరంభంలో జీలుగు, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లుతారు. అయితే, ఆయా విత్తనాల ధరలు భారీగా పెంచేశారని రైతులు చెబుతున్నారు. గతంలో 30 కిలోల జీలుగు బస్తా సబ్సిడీ పోనూ రూ.1350-1400 లోపే దొరికేదని, కానీ ప్రస్తుతం రూ.2455కు పెరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బస్తాపై రూ.వెయ్యి భారం వేశారని మండిపడుతున్నారు.



# పింఛన్లు పెంచాలని ఆందోళన

## వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకుల డిమాండ్

## బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా




శక్కర్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు పూర్తవుతున్నా పింఛన్ల పెంపుపై నోరుమెదపడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా స్పందించి దివ్యాంగులకు రూ.6,016, వృద్ధులకు రూ.4,016 పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. పింఛన్ల కోసం నిర్వహిస్తున్న ముఖ గుర్తింపును లబ్ధిదారుల ఇంటివద్దే చేపట్టాలని, నూతన పింఛన్లు వెంటనే అందించాలని, ఇంటి నిర్మాణం కోసం దివ్యాంగులకు రూ.5లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి వెంకటేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ నజీర్, గాండ్ల రాజు, రహీముద్దీన్, లకన్‌సింగ్, సిరిగిరి దేవదాస్, గంగన్ పర్వయ్య, ఆవుల సాయిలు, సావిత్రి, రజిత, కరుణ, అనూషాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దయవల్లే బాన్సువాడ అభివృద్ధి



వర్ని,

తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దయతోనే బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపాటు తిమ్మాపూర్ ఆలయం, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి వేల కోట్లు నిధులు కేసీఆర్ దయతోనే వచ్చాయని పేర్కొన్నారు. వర్ని మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు ఈ సమావేశానికి బాజిరెడ్డితోపాటు సభ్యత్వ నమోదు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వీజీ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట ఆగయ్య హాజరయ్యారు. సమాశానికి ముందు వర్ని మండల కేంద్రంలో నేతాజీ చౌరస్తా వద్ద బాజిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఫంక్షన్‌హాలుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ..బాన్సువాడ నియోజకవర్గ ప్రజల మనసు బీఆర్ఎస్‌లో ఉన్నదని, శరీరం మాత్రం కాంగ్రెస్‌లో ఉన్నదని చమత్కరించారు. కాంగ్రెస్ పాలనలో అధిక నిధులు వస్తాయని బీఆర్ఎస్‌ను వదిలి హస్తం పార్టీలోకి ఆశతో వెళ్లిన పోచారం శ్రీనివాసరెడ్డి పరిస్థితి ఆశ దోశ అప్పడంలా మారిందని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్‌లో లక్ష్మీపుత్రుడు కాస్త కాంగ్రెస్‌లో దరిద్రపు పుత్రుడయ్యాడని విమర్శించారు. బాన్సువాడ నియోజకవర్గానికి ఏది అడిగితే అది కేసీఆర్ ఇచ్చారని, నాలుగు నియోజకవర్గాలకు ఇచ్చే నిధులు ఒక్క బాన్సువాడకే ఇచ్చారని తెలిపారు.

# రైతంగా పోరాటాన్ని ఉధృతం చేస్తాం - ఏకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం బిక్షపతి

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 10. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి పట్టణంలో అఖిల భారత రైతు - కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 2వ మహాసభ ఘనంగా నిర్వహించబడింది. మహాసభ ప్రారంభానికి ముందు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సుర నర్సయ్య సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభకు రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పూరి భూమయ్య హాజరయ్యారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సుర నర్సయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మామిడాల బిక్షపతి మాట్లాడుతూ దేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, పంటల బీమా సక్రమంగా అమలు చేయడం, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతు, కూలీల హక్కుల పరిరక్షణ కోసం సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు ఐక్యంగా పోరాడితేనే తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం మహాసభలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి కూలీలకు సంవత్సరానికి మరిన్ని పనిదినాలు కల్పించాలని, కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు అందజేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి వర్తింపజేయాలని, పంటలకు బోనస్ ప్రకటించాలని తీర్మానించారు. గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణ సదుపాయం కల్పించాలని, విత్తనాలు, విద్యుత్ రంగాలకు సంబంధించిన నూతన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపి పలు నిర్ణయాలు తీసుకున్నారు. మహాసభ సందర్భంగా ఏఐకేఎంఎస్ కామారెడ్డి జిల్లా నూతన కమిటీని కూడా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుర నర్సయ్యను ఏకగ్రీవంగా నియమించినట్లు నాయకులు ప్రకటించారు. మొత్తం 11 మంది సభ్యులతో జిల్లా కమిటీని







ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కూలీలు, సంఘం నాయకులు, కార్యకర్తలు మహాసభలో పాల్గొన్నారు.

# టీ10 క్రికెట్ టోర్నీ సెమీఫైనల్‌కు నాలుగు జట్లు

**ఉత్కంఠ రేపుతున్న పోటీలు.. విజేతల కోసం హోరాహోరీ సమరం**

**కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** రాజంపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న టీ10 క్రికెట్ టోర్నమెంట్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు విజయవంతంగా ముగియడంతో సెమీఫైనల్‌కు అర్హత సాధించిన నాలుగు జట్లు ఖరారయ్యాయి. టోర్నమెంట్ ప్రారంభం నుంచి అద్భుత ప్రదర్శన కనబరిచిన జట్లు సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుని ట్రోఫీ కోసం పోరుకు సిద్ధమయ్యాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో థండర్ స్ట్రైకర్స్ జట్టు, లెజెండ్ లయన్స్ జట్టుతో తలపడనుండగా, రెండో సెమీఫైనల్‌లో రైజింగ్ స్టార్స్ జట్టు, గేమ్ చేంజర్స్ జట్టుతో తలపడనుంది. లీగ్ దశలో ఈ నాలుగు జట్లు సమిష్టి క్రీడా నైపుణ్యం, కట్టుదిట్టమైన బౌలింగ్, దూకుడైన బ్యాటింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

సెమీఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని, ప్రతి జట్టు ఫైనల్ చేరేందుకు తమ శక్తివంచన లేకుండా పోరాడనున్న నేపథ్యంలో క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల ప్రతిభ, జట్ల మధ్య ఉన్న పోటీ తత్వం మ్యాచ్‌లకు మరింత ఆకర్షణను తీసుకురానున్నాయి.




టోర్నమెంట్ ప్రారంభం నుంచి స్థానిక ప్రజలు, క్రీడా ప్రేమికులు పెద్ద ఎత్తున హాజరై ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. సెమీఫైనల్ మ్యాచ్‌లకు మరింత భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంత యువతలో క్రికెట్‌పై ఆసక్తిని పెంచేందుకు ఈ టోర్నమెంట్ ఎంతగానో దోహదపడుతోందన్నారు.

సెమీఫైనల్‌లో విజయం సాధించే జట్లు ఫైనల్‌కు చేరుకుని ఛాంపియన్ టైటిల్ కోసం పోటీ పడనున్న నేపథ్యంలో రాజంపేటలో క్రికెట్ సందడి మరింత పెరిగింది. క్రీడాభిమానులందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మ్యాచ్‌లు ఎవరి ఖాతాలో విజయం నమోదు చేస్తాయో చూడాల్సి ఉంది.

# చిన్న మల్లారెడ్డి గ్రామంలో బడిబాట కార్యక్రమం

**ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల విశిష్టత వివరించిన ఉపాధ్యాయులు**

**- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ విద్యే బాట అని పిలుపు**

కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి
కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "బడిబాట" కార్యక్రమం బుధవారం చిన్న మల్లారెడ్డి గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంపొందించడం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్యా విధానాన్ని ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాయ్స్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, పీఎం శ్రీ ఎంపీపీఎస్ మరియు ఎంపీపీఎస్ (బీసీ) పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు విశేషంగా స్పందించారు.

కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, నలిని, హనుమండ్లు, సాయగౌడ్లతో పాటు ఉపాధ్యాయ బృందం గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ విద్య కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని వివరించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మి రాజు, ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీరాజా గౌడ్, మాజీ సర్పంచులు రామా గౌడ్, ఆనంద్ రావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విద్య



ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని కలిసి పిల్లల విద్యపై చర్చించి ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు.

ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నాణ్యమైన విద్య, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోధన, కంప్యూటర్ విద్య, ఆంగ్ల మాధ్యమ బోధన, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయ సౌకర్యాలు, క్రీడా సామగ్రి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, సురక్షిత విద్యా వాతావరణం వంటి అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయులు అనుభవజ్ఞులు, శిక్షణ పొందిన నిపుణులని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

"మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి -- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయండి" అనే సందేశంతో నిర్వహించిన ఈ బడిబాట కార్యక్రమం గ్రామంలో విశేష స్పందన పొందింది. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల చేరికలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామంలో విద్యా చైతన్యాన్ని పెంపొందించడంలో ఈ బడిబాట కార్యక్రమం కీలకంగా నిలిచిందని, రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెరుగుతుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంజీరా ఎత్తిపోతల పథకం భూసేకరణపై ఆర్‌డఆర్ కమిటీ సమీక్ష

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 10. (ప్రజాజ్యోతి)** మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై ప్రాజెక్టు స్థాయి పునరావాస మరియు పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) కమిటీ బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పిట్లం మండలంలోని నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ అంశాలను కమిటీ పరిశీలించింది. భూసేకరణలో అత్యల్ప విస్తీర్ణంలో మాత్రమే భూములను సేకరిస్తుండటంతో ఎటువంటి నివాస గృహాల నిర్వాసనం (డిస్ప్లేస్మెంట్) జరగడం లేదని,



స్థానిక కుటుంబాల జీవనోపాధిపై కూడా ఎలాంటి ప్రతికూల ప్రభావం (లైవ్ లిహుడ్ ఇంపాక్ట్) ఉండదని కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు సంబంధించి భూ సేకరణ, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం-2013 (ర్ఫర్ యాక్ట్, 2013) ప్రకారం పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు (ఆర్ అండ్ ఆర్ బెన్ఫిట్స్) వర్తించవని కమిటీ నివేదించింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), బాన్సువాడ ఆర్డీవో, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీపీవో, పిట్లం తహసీల్దార్, ఎస్‌బీఐ పిట్లం శాఖ మేనేజర్‌తో పాటు ఆర్‌డఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపి కార్యకర్తలతో స్వామివారికి ప్రత్యేక పూజలు

-- పైడి ఎల్లారెడ్డి



**కామారెడ్డి ప్రతినిధి జూన్ 10 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి లో శ్రీ కాలబైరవ స్వామి వారి ఆలయం లో అదేవిధంగా శ్రీ సీతారామచంద్ర రాజరాజేశ్వర ఉభయ ఆలయాలలో బుధవారం బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వాహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్య దర్శి రవీంధర్ రావ్, రామారెడ్డి మండల అధ్యకులు సందీప్,జిల్లా కార్యవర్గ సభ్యులు చెట్టుకురిమల్లేష్, పందులగోపి, మాజీ మండల అధ్యకులు గడ్డం ప్రసాద్,కట్ట ఈశ్వర్, రామారెడ్డి మాజీ సర్పంచ్ సంజీవ్,ఒగ్గు వెంకటస్వామి,చౌకీ భరత్, కోటూరి విజయ్, కార్యకర్తలు పాల్గొనారు. 12 ఏళ్ల విజయవంతమైన పాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి గర్వకారణం. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టి, యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త దిశను చూపారు.ఆ భగవంతుడు దేశ ప్రధా మోదీ కి ఆయురారోగ్యాలు ప్రసాదించి, భగవంతుని కృపా కటాక్షాలతో దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే శక్తిని అందించాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# నూతన పంచాయితీ కార్యదర్శికి సన్మానం



**నాగిరెడ్డిపేట్,జూన్10(ప్రజాజ్యోతి);** నాగిరెడ్డిపేట్ మండలంలోని వదలపర్తి గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అశోక్ ను బుధవారం బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.ఇటీవల జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శిగా కొనసాగిన అజీమ్ మండలంలోని లింగంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు.ఆయన స్థానంలో రాజంపేట్ నుండి బదిలిపై విచ్చేసిన అశోక్ బాధ్యతలను స్వీకరించారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్,గామా బూత్ అధ్యక్షులు రాజు, బీజేపీ నాయకులు ద్యావల్ల రాజు,సాయిబాబా,మణికంఠ,రాజు,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేలపై దోపిడీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్ట్ -- రిమాండ్‌కు తరలింపు

### మూడు కేసులను ఛేదించిన మద్నూర్ పోలీసులు
### ముగ్గురు నిందితుల అరెస్ట్ -- రెండు బైకులు, నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు కత్తుల స్వాధీనం
### వరాలు వెల్లడించిన బాన్సువాడ డీఎస్పీ శ్రీ బి. విఠల్ రెడ్డి




**జుక్కల్ ఆర్సి ప్రజా జ్యోతి జూన్ 10** కామారెడ్డి జిల్లా పరిధిలోని మద్నూర్, జుక్కల్, నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో హైవేలపై ఒంటరిగా ప్రయాణిస్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నేర ముఠాను మద్నూర్ పోలీసులు అరెస్ట్ చేసి మూడు కీలక కేసులను ఛేదించారు. తేదీ 02.06.2026న మద్నూర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-161పై బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ గౌస్ (నివాసం: దెగ్లూర్, మహారాష్ట్ర)ను గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి కత్తి చూపించి చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్ మరియు రూ.1000 నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ శ్రీ బి. విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మద్నూర్ ఎస్ఐ శ్రీ మోహన్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ శ్ఉస్మాన్ తో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌ల సహాయంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు కేసు వివరాల్లోకి వెళితే దర్యాప్తులో భాగంగా నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ ఇలియాస్, మహమ్మద్ ఇస్మాయిల్ ఏ జునైద్, సమీర్ షా అని గుర్తించారు. వీరు హైవేలపై ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని మారణాయుధాలతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. పథకం ప్రకారం 01.06.2026న నాందేడ్ నుండి స్ప్లెండర్ బైక్‌పై బయలుదేరిన నిందితులు మద్నూర్ వద్ద షేక్ గౌస్‌ను దోచుకోవడంతో పాటు, అదే రాత్రి జుక్కల్ చౌరస్తా వద్ద వి. శ్రీనివాస్‌ను కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ మరియు రూ.300 నగదు లాక్కొన్నారు. అదే రోజు రాత్రి నిజాంసాగర్ పరిధిలో చాకలి రాజు వద్ద నుండి పల్సర్ బైక్‌ను దోచుకున్నారు. ఈ మూడు ఘటనలపై మద్నూర్, జుక్కల్, నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. దర్యాప్తు సమయంలో నిందితులు సలబతుపూర్ సమీపంలో మరో వ్యక్తిని అడ్డగించి కత్తితో బెదిరించి దోపిడీ చేయాలని వస్తుండగా, అదే సమయంలో సలబతుపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు వారిని గుర్తించి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు చేసిన నేరాలను అంగీకరించారు.

నిందితుల వివరాలు:

1. షేక్ ఇలియాస్ (తండ్రి: ఇర్ఫాన్, దెగ్లూరు నాకా, నాందేడ్)
2. మహమ్మద్ ఇస్మాయిల్ ఏ జునైద్ (తండ్రి: అబ్దుల్ హమీద్, నాందేడ్)
3. సమీర్ షా (తండ్రి: నాజుక్ షా, మిల్లెట్ నగర్, నాందేడ్)

స్వాధీనం చేసుకున్న వస్తువులు:

1. 3 కత్తులు (దోపిడీలకు ఉపయోగించినవి) 2. 4 మొబైల్ ఫోన్లు 3. 2 మోటార్‌సైకిళ్లు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, హైవేలపై ప్రయాణించే సమయంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని డిఎస్పి తెలిపారు.

ఈ కేసులను చాకచక్యంగా ఛేదించిన బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రవికుమార్, మద్నూర్ ఎస్ఐ శ్రీ మోహన్ రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ శ్రీ ఉస్మాన్, కానిస్టేబుళ్లు విఠల్, విష్ణు, శ్రావణ్, శివ, శ్రీకాంత్ తదితరులు మరియు వారి బృందాన్ని జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ గారు అభినందించినట్లు డీఎస్పీ విఠల్ రెడ్డి గారు తెలిపారు

# మర్కల్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ

### 99 రోజుల కార్యాచరణతో గ్రామాభివృద్ధికి కొత్త దిశ
### ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
### గ్రామస్థుల సూచనలతో అభివృద్ధి ప్రణాళికకు రూపకల్పన
### స్పెషల్ ఆఫీసర్ అశోక్



సదాశివనగర్, జూన్ 10 (ప్రజాజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు లక్ష్యంగా చేపట్టిన "99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం లో భాగంగా సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామంలో బుధవారం ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సభకు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి అశోక్. హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడమే కాకుండా, గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతోందని తెలిపారు.గ్రామసభకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై తమ సమస్యలు, అవసరాలు, అభివృద్ధి సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని తాగునీటి సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, ఉపాధి హామీ పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వంటి పలు అంశాలపై గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మన గ్రామంలో ఉన్న పాఠశాలను వీడి వేరే పాఠశాలలకు పిల్లల్ని పంపవద్దని మన పాఠశాలలో విశాలమైన గదులు విశాలమైన ఆటస్థలం డిజిటల్ తరగతి గదులు ఉన్నందున తల్లిదండ్రులు పిల్లల్ని మన ఊరి పాఠశాలలోనే చేర్పించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక సర్పంచ్ ప్రియాంక-సుభాష్ రెడ్డి. మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రజలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా విజయ దీపాలు ఉండే విధంగా డ్రైనేజీ కాలువల సమస్య లేకుండా చూస్తున్నామని సభలో వివరించారు మన పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల సంఖ్య పెంచి మన పాఠశాలకు గ్రామ ప్రజలు తల్లిదండ్రులు మీ పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మా పిల్లల్ని మన ఊరి పాఠశాలలోనే ఈ సంవత్సరం చేర్పిస్తున్నానని మర్కల్ స్థానిక సర్పంచ్ వెల్లడించారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించగా, అధికారులు వాటిని నమోదు చేసి సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రపు లింగం. పాలకవర్గ సభ్యులు గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదావరి. జీపీఓ విద్యుత్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు. గ్రామస్థాయి సిబ్బంది, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 20వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభ

పరిశుభ్రత, ఓటరు నమోదు, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన

**కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి పట్టణంలోని 20వ వార్డులో ప్రత్యేక వార్డు సభ స్థానిక వార్డు కౌన్సిలర్ కళ్లెం సావిత్రి -- సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ వార్డు సభకు వార్డులోని ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై వార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సభను ఉద్దేశించి వార్డు కౌన్సిలర్ కళ్లెం సావిత్రి -- సత్యం మాట్లాడుతూ, వార్డు అభివృద్ధి అనేది కేవలం ప్రజాప్రతినిధుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను విడివిడిగా వేరు చేసి మున్సిపల్ ఆటోకు అందించాలని సూచించారు. ఇంటి చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో లేదా మురికి కాలువల్లో వేయడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కౌన్సిలర్, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయాలని కోరారు. నీటి వనరులను కాపాడుకోవడం నేటి అవసరమని, భవిష్యత్ తరాలకు తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే వార్డులోని ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నిల్వ నీరు ఉండకుండా చూడాలని, సామూహిక పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన వార్డు నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా () కార్యక్రమంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డులోని అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటరు వివరాలను 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

ఈ ప్రత్యేక వార్డు సభలో మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, వీధి దీపాల



సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలతో చర్చించి సూచనలు స్వీకరించారు.

కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ రాములు, మున్సిపల్ వార్డు ఆఫీసర్ దీప్తి, పోలీసు శాఖకు చెందిన ఏఎస్సై, కానిస్టేబుల్ ఆర్.పీ. లలిత, డ్రైవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మమత, ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు, అలాగే వార్డులోని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మన్సూర్, రఫిక్, హమీద్, జాఫర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దగలమని సభలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక వార్డు సభ ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఓటరు నమోదు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.

# ప్రజల వద్దకే వెళ్లి గ్రామసభ నిర్వహించిన మాతుసంగం సర్పంచ్ వందన-బల్వంత్‌రావు



గాంధారి, జూన్ 10 (ప్రజాజ్యోతి) ప్రజాపాలనను మరింత బలోపేతం చేయడం, గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం లక్ష్యంగా గాంధారి మండలంలోని మాతుసంగం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల వద్దకే వెళ్లి గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ వందన-బల్వంత్‌రావు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని సర్పంచ్ హామీ ఇచ్చారు.గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన, ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దామోదర్‌రెడ్డి (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిప్పరం తాండ లో ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం




**గాంధారి, జూన్ 10 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని తిప్పరం తండాలో నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థులు కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ బడులను ప్రోత్సహించాలని గ్రామసభలో సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం నాయక్, ఉపసర్పంచ్ మంజ గోపాల్, వార్డు సభ్యులు తాన్సింగ్, రాంచంద్, కమలాబాయి, యశోద, గాజీరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల చేరికలపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మండలంలోని పాఠశాలలకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు



ఎం ఈ ఓ శ్రీహరి

**గాంధారి, జూన్ 10 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కొత్త విద్యాసంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు చేరినట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీహరి తెలిపారు.పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ప్రధానోపాధ్యాయులు తరగతి గదులు, మరుగుదొడ్లను పూర్తిగా శుభ్రం చేయాలని ఆయన సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి పాములు, విషపురుగులు సంచరించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీపీ ఎస్ మాతుసంగం గ్రామంలో పర్యటించి కొత్త విద్యార్థుల చేరికల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీహరి, ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయురాలు విశాల, సీఆర్పీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# షబ్బీపూర్ గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం -- సర్పంచ్ రేకులపల్లి పద్మ**



**కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం, షబ్బీపూర్, ప్రజా జ్యోతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే గుర్తించి వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న “99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా షబ్బీపూర్ గ్రామంలో గురువారం విస్తృత స్థాయి గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం వంటి లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.
గ్రామసభకు స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, వాటికి తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని కూడా ఈ కార్యక్రమం ద్వారా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను, అవసరాలను గ్రామసభ వేదికగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలు గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.
గ్రామ సర్పంచ్ రేకులపల్లి పద్మ మాట్లాడుతూ షబ్బీపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని సహకరించాలని కోరారు.
గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగం గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సభలో వివరించారు. ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనులు, పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు సూచించిన సమస్యలను నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, గ్రామ పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, పేదలకు గృహాల కల్పన, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, మహిళా సంక్షేమం, యువత ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, పోలీసు సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల నమోదు, ఆరోగ్య సేవల విస్తరణ, మహిళా సాధికారత, పారిశుధ్య కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలపై కూడా అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలు, రుణ సదుపాయాలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించే అవకాశం కల్పించడంతో పాటు అధికారులు వెంటనే స్పందించి అవసరమైన సూచనలు ఇవ్వడం విశేషంగా ఆకట్టుకుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం ద్వారా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామస్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ ప్రభుత్వం--ప్రజల మధ్య వారధిగా నిలుస్తోందని, షబ్బీపూర్ గ్రామంలో నిర్వహించిన ఈ గ్రామసభ ప్రజల్లో చైతన్యం నింపడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కొత్త దిశానిర్దేశం చేసిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, గ్రామాభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా పనిచేయాలని సభలో పిలుపునిచ్చారు.

# మృతి చెందిన కానిస్టేబుల్ రఘు కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర





**గాంధారి, జూన్ 10 (ప్రజాజ్యోతి)** గాంధారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కురుపాటి రఘు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల జిల్లా పోలీసు శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర బుధవారం బాన్సువాడలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రఘు భార్య రజిని, కుమార్తెలు రసజ్ఞ, అమూల్య, తల్లి చంద్రకళను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎస్పీ, జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ కురుపాటి రఘు విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే పోలీసు సిబ్బందిలో ఒకరని పేర్కొన్నారు. ఆయన మరణంతో పోలీసు శాఖ కర్తవ్యనిరతిగల ఒక మంచి సహచరుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రఘు సేవలను స్మరించుకుంటూ జిల్లా పోలీసు శాఖ తరఫున ఘన నివాళులు అర్పించిన ఎస్పీ, ఆయన అంకితభావం, సేవా తపన పోలీసు శాఖలో చిరస్థాయిగా గుర్తుండిపోతాయని అన్నారు. కుటుంబ సభ్యులు ముఖ్యంగా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, సదాశివనగర్ సీఐ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తడి హిప్పర్గ గ్రామంలో ఘనంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం అధికారులుగ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం సర్పంచ్ అశ్విని సుదర్శన్ కంకర్నె**



బిచ్కుంద (ప్రజాజ్యోతి )జూన్ 10 సర్పంచ్ అశ్విని, స్పెషల్ ఆఫీసర్, మిల్ కుమార్. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న “99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా. మద్నూర్ మండల్ తడి హిప్పర్గ గ్రామంలో బుధవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడం, గ్రామాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభలో గ్రామ ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన తాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు, విద్యా మరియు వైద్య సేవల మెరుగుదల తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను నమోదు చేసి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఆధారంగా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశ్విని సుదర్శన్ కంకర్నె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. గ్రామ ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి ఈ కార్యక్రమం మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా కృషి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. స్పెషల్ ఆఫీసర్,మెల్ కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వాటి అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి జాదవ్ గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతిని తెలియజేస్తూ, ప్రజల సూచనలను స్వీకరించి అభివృద్ధి ప్రణాళికలో పొందుపరుస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, జి పి ఓ సాయిలు. ఐ కే పి వి ఓ ఏ. భీంరావు.ఏ ఈ ఓ సమారిన్. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, అధికారులు, విద్యుత్ శాఖ లైన్మెన్ మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, యువతులు, రైతులు, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామసభలో విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం, మహిళా సంక్షేమం, పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ సేవలు, తాగునీటి సౌకర్యాలు, పేదల సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను వివరించి ప్రజల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.
గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.
ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభించే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీబీపేట లో రసవత్తరంగా గ్రామ సభ



**బీబీపేట్ ప్రజా జ్యోతి జూన్** 10 బీబీపేట మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ ఆవరణ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సర్పంచ్ ఉప్పల సాత్విక సాయి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఇట్టి గ్రామ సభకు ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏ ఈ అనూష మాట్లాడుతూ భగీరథ వాటర్ ట్యాంకులను నెలకు మూడుసార్లు క్లోరినైజేషన్ చేస్తున్నా మని తెలిపారు. భగీరథ నీరు కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామని తెలియజేశారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ బీబీపేట గ్రామంలో దాదాపు 90% విస్తరణలో వరినే పండిస్తున్నారని కావున రైతులు పంట మార్పిడి చేసుకొని ప్రభుత్వం సూచించిన విధంగా సన్న రకం ధాన్యాన్ని పండించాలని దానికి ప్రభుత్వపరంగా 500 రూపాయల బోనస్ వస్తుందని ఎల్ ని ఓ కారణంగా ఈసారి వర్షాలు తక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ వారు సూచిస్తున్నందున ప్రత్యామ్నాయ పంటలు పెట్టాలని ఆయన తెలియజేశారు. పంట పొలాలను కోసిన తర్వాత వరి కొయ్య కాళ్ళను కాల్చవద్దని అలా కాల్చిన యెడల 500 రూపాయల నుండి 2500 రూపాయల వరకు జరిమానా విధించబడునని తెలియజేశారు. అలాగే రైతులు ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకొని వారు వెంటనే చేసుకోవాలని తెలిపారు రిజిస్ట్రేషన్ చేయించుకోలేని యెడల ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రోత్సాహకాలు అందజేయడం జరగదని తెలియజేయడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయం లో జరుగుతున్న అవకతవకల గురించి గ్రామస్తులు అధికారులను అడగగా వారు సరైన సమాధానం ఇవ్వకపోగా కొంచెం సేపు వాగ్వాదం జరిగింది. తర్వాత అధికారులు సమాధానం చెప్పకుండా సభ ముగించడం జరిగింది. ఇలా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో జరిగిన అవకతవకలను సమగ్ర విచారణ జరుపాలని గ్రామ ప్రజలు ముక్త కంఠం తో కోరారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల సాత్విక సాయి, ఉప సర్పంచ్ చందుపట్ల ప్రశాంత్, ఎస్ ఐ కొండా విజయ్, వివిధ శాఖల అధికారులు పుర ప్రముఖులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఇస్రోజీవాడి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక సభ

**పరిశుభ్రత, ఓటరు నమోదు, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రజలకు అవగాహన**

**స్పెషల్ ఆఫీసర్ నరేష్**

**సర్పంచ్ చిందం మల్లేష్**

**పోలీస్ ఎస్ ఐ రంజిత్**



**కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ చిందం మల్లేష్ ఉప సర్పంచ్ సిద్ధం స్వామి స్పెషల్ ఆఫీసర్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సభకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై వార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సభను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి అనేది కేవలం ప్రజాప్రతినిధుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి కుటుంబం తమ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను విడివిడిగా వేరు చేసి మున్సిపల్ ఆటోకు అందించాలని సూచించారు. ఇంటి చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో లేదా మురికి కాలువల్లో వేయడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కౌన్సిలర్, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయాలని కోరారు. నీటి వనరులను కాపాడుకోవడం నేటి అవసరమని, భవిష్యత్ తరాలకు తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

అలాగే వార్డులోని ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నిల్వ నీరు ఉండకుండా చూడాలని, సామూహిక పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన వార్డు నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా () కార్యక్రమంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటరు వివరాలను 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఈ ప్రత్యేక సభలో దేవుని పల్లి ఎస్ ఐ రంజిత్ గ్రామ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిందం మల్లేష్ ఉప సర్పంచ్ సిద్ధం స్వామి గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు గ్రామ పంచాయతీ సెక్రెటరీ రవీందర్ రావు సి సి గంగారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ రంజిత అంగన్వాడి టీచర్లు భాగ్య కృప ఆశ వర్కర్లు సిద్ధం సావిత్రి కొత్త కల్పన వి వో ఏ లు భాగ్య శివ కుమార్ జి పి ఓ రవి అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణ, వీధి దీపాల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలతో చర్చించి సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో శాఖకు చెందిన పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు, అలాగే పార్టీ తదితరులు పాల్గొన్నారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దగలమని సభలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక సభ ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఓటరు నమోదు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.

# ఇస్రోజీవాడి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఈఓ దేవేంద్ర

**రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



**కామారెడ్డి, రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని ఇస్రోజీవాడి గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) దేవేంద్ర సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం కొనుగోళ్లు, నిల్వలు, తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ దేవేంద్ర మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రస్తుతం వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు, కవర్లు, రక్షణ చర్యలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించడంతో పాటు కేంద్రంలో అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు, రికార్డుల నిర్వహణ, తూకం విధానం, గన్నీ బ్యాగుల లభ్యత వంటి అంశాలను పరిశీలించిన దేవేంద్ర సిబ్బందితో మాట్లాడి కొనుగోళ్ల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఏఈఓ దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి ధాన్యం గింజకు సరైన ధర అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలన కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈఓ దేవేంద్ర స్పష్టం చేశారు. దీంతో ఇస్రోజీవాడి గ్రామంలోని రైతులు తమ ధాన్యం సకాలంలో కొనుగోలు పూర్తవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసిన ప్రియుడు

**భార్య--ప్రియుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**

**ప్రమాదం కాదు... పక్కా ప్రణాళికతో జరిగిన హత్య! ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్తను హతమార్చిన కుట్ర వెలుగులోకి**

**సదాశివనగర్ పోలీసుల దర్యాప్తులో సంచలనం... భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు గుట్టురట్టు**

**ఎల్లారెడ్డి డిఎస్పి యస్ శ్రీనివాస్ రావు**



సదాశివనగర్, జూన్ 10 (ప్రజాజ్యోతి) అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్తను అత్యంత దారుణంగా హత్య చేసి, దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన భార్య మరియు ఆమె ప్రియుడి గుట్టును కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీసులు రట్టు చేశారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తేదీ 22-05-2026 న మర్కల్ గ్రామానికి చెందిన కంచర్ల రేణుక తన భర్త కంచర్ల రాజయ్య (45) రాత్రి వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా గుర్తు తెలియని జంతువు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి పడిపోయి మృతి చెందాడని సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ నేతృత్వంలోని దర్యాప్తు బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. సాక్షుల వాంగ్మూలాలు సేకరించడంతో పాటు, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు మరియు పోస్టుమార్టం నివేదికను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ దర్యాప్తులో ఇది ప్రమాద మరణం కాదని, తలపై బలంగా కొట్టడం వల్ల జరిగిన పక్కా ప్రణాళికాబద్ధమైన హత్యగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా మర్కల్ గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు కంచర్ల గంగశేఖర్ (37) ను అదుపులోకి తీసుకుని విచారించగా షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. మృతుడి భార్య రేణుకతో గంగశేఖర్‌కు గత నాలుగు సంవత్సరాలుగా అక్రమ సంబంధం కొనసాగుతోంది. తమ బంధానికి భర్త రాజయ్య అడ్డుగా ఉన్నాడని భావించడంతో పాటు, అతను చనిపోతే వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులను పొందవచ్చనే దురాశతో ఇద్దరూ కలిసి రాజయ్యను హతమార్చాలని కుట్ర పన్నారు. ఈ కుట్రలో భాగంగా 21-05-2026 న గంగశేఖర్ ముందస్తు ప్రణాళికతో ఐరన్ రాడ్ తీసుకొని వెళ్లి, రాజయ్యను గాంధారి ప్రాంతానికి పిలిపించి మద్యం తాపించి మత్తులోకి నెట్టాడు. అనంతరం తిర్మన్‌పల్లి గ్రామ శివారులో రాత్రి వేళ మత్తులో ఉన్న రాజయ్య తలపై ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఘటనను రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు మృతదేహం మరియు మోటార్ సైకిల్‌ను అక్కడే అమర్చి పరారయ్యాడు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతని సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, మృతుడి మోటార్ సైకిల్, నిందితుల మొబైల్ ఫోన్లు మరియు ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిండుతుల వివరాలు :

ఞా1 -- కంచర్ల గంగశేఖర్ (ప్రియుడు), ఞా2 -- కంచర్ల రేణుక (భార్య)

నిందితులైన ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం జరిగిందని డీఎస్పీ వెల్లడించారు

ప్రారంభంలో కేవలం రోడ్డు ప్రమాదంగా కనిపించిన ఈ కేసును అత్యంత సూక్ష్మంగా దర్యాప్తు చేసి అసలు నిజాన్ని వెలికితీసిన సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) పుష్ప రాజు, ఏఎస్సై సిద్ధిక్. మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డి సి ఓ



**బీబీపేట్ ప్రజా జ్యోతి జూన్ 10** బీబీపేట మండలంలోని మాందాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి నరేందర్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎం సి ఓ నరేందర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు తరలింపు ప్రక్రియను వేగవంతం చేసి ఐదు రోజులలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి గంగాసాగర్, సర్పంచ్ హరీష్ యాదవ్, ఎం పి ఓ నరేందర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఈఓ బాల్ రెడ్డి, ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**నాగిరెడ్డిపేట్,జూన్10(ప్రజాజ్యోతి);** నూతన విద్యా సంవత్సరం ఈనెల 15న ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను,నోట్ బుక్కులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని మండల విధ్యాదికారి వెంకట్ రెడ్డి ప్రారంబించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను,నోట్ బుక్కులను అందజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకుధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని,విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాంరెడ్డి,పాఠశాల సిబ్బంది,సిఆర్పీలు రాజు,కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి ప్రయాణికులే టార్గెట్.. మూడు కేసులు ఛేదించిన మద్నూర్ పోలీసులు




**బిచ్కుంద (ప్రజాజ్యోతి )10జూన్** హైవేలపై ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను మద్నూర్ పోలీసులు అరెస్ట్ చేసి మూడు కేసులను ఛేదించారు. హైవేలపై ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను మద్నూర్ పోలీసులు అరెస్ట్ చేసి మూడు కేసులను ఛేదించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ బి. విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్, మద్నూర్ ఎస్ఐ మోహన్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ ఉస్మాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ సాయంతో నిందితులను గుర్తించారు. నిందితులు మహారాష్ట్ర నాందేడ్జిల్లాకు చెందిన షేక్ ఇలియాస్, మహమ్మద్ ఇస్మాయిల్ ఏ జునైద్, సమీర్ షాగా పోలీసులు గుర్తించారు. వీరు జూన్ 1 రాత్రి నాందేడ్ నుంచి స్లెండర్ బైక్ పై బయలుదేరి, మద్నూర్ వద్ద షేక్ గౌస్ వద్ద నుంచి మొబైల్, రూ.1000, జుక్కల్ చౌరస్తా వద్ద వి. శ్రీనివాస్ వద్ద నుంచి మొబైల్, రూ.300, నిజాంసాగర్ వద్ద చాకలి రాజు వద్ద నుంచి పల్సర్ బైక్ దోచుకున్నారు. సలబత్పూర్ సమీపంలో మరో దోపిడీకి వెళ్తుండగా చెక్పోస్ట్ వద్ద వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 3 కత్తులు, 4 మొబైల్ ఫోన్లు, 2 బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్కు తరలించామని డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు. హైవేల పై అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కేసు ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# సిరికొండ మండలానికి సరిపడే యూరియా ఎరువులు అందుబాటులో ఉంచుతాం రైతులు ఆందోళన చెందవద్దు : ఏవో నర్సయ్య

**సిరికొండ ( ప్రజా జ్యోతి )జూన్ 10** సిరికొండ మండలంలోని రైతులు ఎరువుల లభ్యత పైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి టి నర్సయ్య తెలియజేశారు రైతులు మండలంలో సొసైటీలలో మరియు ఫర్టిలైజర్ షాప్ లలో అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ కొరకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ విధానం అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఉన్నది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో వర్షాలు కురవడం లేదు వరి నారు పోయడం, మొక్కజొన్న తదితర పంట విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సిరికొండ మండలంలోని రైతులు ఎరువుల లభ్యత పైన ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదు. సిరికొండ మండలంలో గత వర్షాకాలం సుమారు 28631 ఎకరాలు పంట సాగు చేయడం జరిగింది. ఈ వానకానికి సంబంధించి సుమారుగా 29,580 ఎకరాలు అంచనా వేసుకున్న మండలానికి సరిపడా యూరియా ఎకరానికి రెండు చొప్పున ఇవ్వడం జరుగుతుంది. 59160 యూరియా బస్తాలు మండలానికి అవసరం ఉంటాయి. మండలంలో 13871 రైతులు ఉన్నారు. ఇప్పటివరకు మండలానికి 10761 బ్యాగుల



యూరియాను 3495 రైతులు బుక్ చేసుకోవడం జరిగింది. మండలానికి యూరియా సరఫరా రోజువారీగా రావడం జరుగుతుంది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఏంటి ఇష్టమైన విధి విధానాలు, రైతుల సంఖ్య, సాగు భూమి యొక్క విస్తీర్ణం పరిగణలోకి తీసుకొని యూరియాను ప్రతి రైతుకు అందించడం జరుగుతుంది. కావున రైతులు ఇప్పుడే పంటలు వేసేది క్రమంలో ఉన్నాము కాబట్టి తొందరపాటుగా యూరియా రాదు అని అపోహలకు కాకుండా దశలవారీగా బుక్ చేసుకొని యూరియాను తీసుకోవాలని కోరుతున్నాము. మండలాన్ని ఒక యూనిట్ గా పరిగణించి ఎరువులు బుకింగ్ చేయడం జరుగుతుంది, కావున రైతులు మండలంలోని మూడు సొసైటీలు మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియాను బుకింగ్ చేసుకోవాలని తెలియజేస్తున్నాము. రైతులు ప్రైవేట్ డీలర్ వద్ద యూరియా కొనుగోలుకు ఎలాంటి ఇతర మందులు కొనవలసిన అవసరం లేదు ప్రతి డీలర్ కు సూచనలు చేయడం జరిగింది. రైతులు ప్రైవేట్ డీలర్ వద్ద ఏదైనా ఇతర మందులు తీసుకోవాలని కానీ, వీరా కంటే ఎక్కువ అమ్మిన కానీ ఉంటే మా దృష్టికి తీసుకురావాలని రైతులకు తెలియజేస్తున్నాము. పంటకు అవసరమున్న దానినిబట్టి యూరియాను బుక్ చేసుకోవాలని కోరుతున్నాము. ఈ వాన కాలానికి రైతులందరికీ యూరియా అందించేలా చర్యలు చేపడుతూ యూరియాను అందుబాటులో ఉంచుతాము దీనికి మండలంలోని రైతులందరూ సహకరించాలని కోరుతున్నాము.

# రసభసగా కొనసాగిన గ్రామసభ

**ప్రజాజ్యోతి,బాల్కొండ జూన్ 10** బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ప్రజా పాలన-ప్రగతి పాలన లో భాగంగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఒకే వర్గానికి చెందిన వారి ఆదిపత్యమే జరగటం విశేషం. ప్రజా పాలన ప్రగతి పాలన లో భాగంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యా, వైద్య, వ్యవసాయ, నీటిపారుదల పోలీస్, మరియు విద్యుత్ శాఖ అధికారులు నివేదికలు సమర్పించారు. భూకబ్జా చెంచా గార్ల హడావిడి బుధవారం రోజు జరిగిన ప్రజా పాలన ప్రగతి పాలన లో భాగంగా అల్లా కొండ ఖిల్లా ను పర్యాటక కేంద్రం కోసం తీర్మానం చెయ్యాలని కోరుతూ మరియు గతంలో ఖిల్లా లో లభ్యమైన విగ్రహాలు గురించి అల్ల కొండ ఖిల్లా పరిరక్షణ సమితికి చెందిన బాద్యులు నర్సింగ్ రావు మాట్లాడుతూ ఉండగ ఒకే వర్గానికి చెందిన ఇద్దరూ వ్యక్తులు నీ కెందుకు విగ్రహాలు విగ్రహాలు ఏం చేసుకుంటావని, ఖిల్లా గురించి ఎందుకు పట్టింపు అని నీలదీస్తున్న సమయంలో గ్రామ పంచాయతీ సభ్యులు, ప్రజలతో పాటు మండల అధికారులు ఉన్న ఒక్కడు నోరు విప్పలేదు ఈ సంఘటన జరిగినప్పుడు కాంగ్రెస్, బి. ఆర్..ఎస్,.ఐ.ఏం తో పాటు బి. జె. పి అగ్ర నాయకులు కూడా ఉన్నారు. చరిత్ర గురించి వివరిస్తూ ఉండగా అన్య మాతస్థులు అడ్డు తగలటం ఏమిటని నర్సింగ్ రావు ప్రశ్నించారు. ఇది ఇలా ఉండగా గ్రామంలో పురాతన విగ్రహాలు లభ్యమైతే రెవెన్యూ,



లేదా పోలీస్ ద్వారా పురావస్తు శాఖ వారికి అప్ప జెప్పాలని నిబంధనలు ఉన్నాయని లభించిన విగ్రహాలు కరీంనగర్, లేదా హైదరాబాద్ మ్యూజియం లో పెడతారని నర్సింగ్ రావు వివరించారు. మరోవైపు ఖిల్లా భూములు కబ్జాలు కాకుండ పురా వస్తు శాఖ అధికారులు బాల్కొండకు రావడం భూకబ్జా దారులకు చెక్ పెట్టినట్లు కావడం వల్ల కొందరు భూ కబ్జా దారుల చెంచాలు జీర్ణించు కోలేక కొందర్ని రోడిలుగా తైయారు చేస్తున్నట్లు తెలుస్తుందని నర్సింగ్ రావు ఆరోపించారు. ఇది ఇలా ఉండగా మన ఊరు – మన చరిత్ర గురించి తెలుసుకొని వారు చరిత్ర హీనులని, గతంలో కని పించ కుండా పోయిన విగ్రహాలు కరీంనగర్, హైదరాబాద్ మ్యూజియం లో పెట్టిస్తామని, అలాగే ఖిల్లా కు సంబశీదించిన సేంట్ భూమి కూడా భూ కబ్జా దారులకు పోనీయకుండా " హైడ్రా " పరిధి లోకి పురా వస్తు శాఖ పరిధి లోకి వెళ్తాయని నర్సింగ్ రావు ఈ సందర్భంగా వివరించారు.

దేశ స్వాతంత్రం నుండి బస్టాండ్ లేదు.

బాల్కొండ పేరుకే అసెంబ్లీ నియోజక వర్గం దేశ స్వాతంత్రం నుండి బస్టాండ్ లేదని ప్రయాణికులు రోడ్డుపై నిలుచుడి ప్రయాణం చేస్తున్నారని, బాల్కొండ లో ఉన్న ఏ రాజకీయా పార్టీ వారు బస్టాండ్ గురించి పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీ ఏర్పడి గత 30 సంవత్సరాలు గడుస్తున్నా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం గ్రామసభలో వివరించడం జరిగింది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో గ్రామపంచాయతీ నడుస్తుందని ఇందులో ఎమ్మార్వో జోక్యం చేసుకొని ప్రైవేటు భూములకు గుండా ఎన్టీఆర్ కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని సీనియర్ జర్నలిస్ట్ బిఆర్ నర్సింగరావు తెలిపారు. ఎమ్మార్వో సైతం దీనిని ఆదర్శవంతంగా తీసుకొని ఎన్టీఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, అలాగే ప్రైవేటు వ్యక్తుల భూములు,కాలువలు కబ్జా చేసి విషయాన్ని ఎమ్మార్వో కుతేల్పగా ఎమ్మార్వో వెంటనే స్థల పరిశీలనకు వచ్చి ఎన్టీఆర్ కాలనీలో జరుగుతున్న కబ్జాలు చూడాలని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ కాలనీ ప్రజలు సైతం ఎమ్మార్వో కు తెలిపారు.

# బోధన్‌లో ఘనంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభ,...

**ప్రజా జ్యోతి బోధన్.. జూన్. 10..** నిజామా బాద్ జిల్లా బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (ఋణ) కళ్యాణ మండపంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 31వ వార్డు నుండి 38 వ వార్డుల సంయుక్త వార్డు సభను నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో అడిషనల్ కలెక్టర్ (ూజ ాదీ) భుజంగరావు, మునిసిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పద్మ, మునిసిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ,బోధన్ టౌన్ ూ× హబీబ్ ఖాన్, మునిసిపల్ మేనేజర్ రమేష్,బోధన్ మండల =× శ్రీనివాస్ , నాగేశ్వర్ రావు, మెప్మా పట్టణ సమన్వయకర్త శ్రీనివాస్ హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలతో వార్డు సభలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలందరు భాధ్యతగా ఇళ్లలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ఆటోలకే అందించాలని, ఇంటి ముందున్న డ్రైనేజీ లలో చెత్త వేయకూడదని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, పాలిథీన్ క్యారీ బ్యాగులను వాడవద్దని సూచించారు. వర్షాకాలం మురుగునీరు మోరీలలో నిలుస్తే,దోమలు తయారయ్యి మలేరియా, డెంగీ, కలరా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దోమల నివారణకు మోరీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×= – ూజూవఎఙఖుశ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ) ప్రక్రియ గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటర్ల జాబితాతో మ్యాప్ చేసుకోవాలని, దీని ఉద్దేశ్యం అర్హత ఉన్నవారు ఓటరుగా ఉండాలి, అర్హతలేని వారు అనగా చనిపోయినవారు, డూప్లికేట్, పర్మనెంట్ మైగ్రేషన్ అయినవారిని తొలగించి పారదర్శకతో



కూడిన ఓటర్ల జాబితా తయారు చేయడం అని తెలిపినారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, ఇన్సూరెన్స్ స్కీంలు అమలుచేస్తుంది. ప్రజలు ఆలస్యం చేయకుండా సరియైన సమయంలో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం నుండి లబ్దిపొందాలని తెలిపినారు. టౌన్ ూ× మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెట్టుకుని ఉండాలన్నారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు (ాూం) చెప్పకూడదని తెలిపినారు. ఈ మధ్య కాలంలో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వస్తున్న దొంగ కాల్స్ నమ్మి మోసపోవద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు



తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కోరారు మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ వార్డు సభల్లో వచ్చిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించడం జరిగింది. వర్షాకాలం సీజన్ కాబట్టి ప్రజల ఆరోగ్యం ముఖ్యం, పట్టణములోని ప్రజలందరికి మునిసిపల్ నుండి కల్పించవలసిన అన్ని రకాల సౌకర్యాలు వీధుల శుభ్రత, డ్రైనేజి క్లీనింగ్, మంచినీటి సరఫరా, స్ట్రీట్ లైట్ల నిర్వహణ చేస్తున్నామని, ప్రజలు సహకారం అందించి చెత్తను మోరిల్లో వేయవద్దని, మునిసిపల్ చెత్త ఆటోలుకే అందించాలని తద్వారా బోధన్ పట్టణమును చెత్త రహిత పట్టణముగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా (వీఖూహీూ) సిబ్బంది, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జగదాంబ తండాలో ప్రత్యేక గ్రామసభ

**సిరికొండ ( ప్రజా జ్యోతి)జూన్ 10** సిరికొండ మండలంలో జగదాంబ తండా గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి తహసిల్దార్ రవీందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత, జల సంరక్షణ, ఆరుతడి పంటలపై గ్రామంలో నీటిని నిల్వంచకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిల్వ ఉంటే అందులో దోమల లార్వా తయారవుతుందని దానిద్వారా గ్రామంలో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తాయని వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులుపాల్గొన్నారు




# మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రమాదకరం టోల్ ప్లాజా వద్ద అవగాహన కల్పించిన ఎస్సై సుమలత



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్.10** మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద బుధవారం బుధవారం అరవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందాక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుమలత వాహనదారులకు రోడ్ భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ దివ్య చక్రం వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు అలాగే మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని హెచ్చరించారు. డ్రింక్ అండ్ డ్రైవ్ కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ను ఉల్లంఘించిన వారిని ఎట్టి పరిస్థితులను క్షమించబోమని ఎస్సై స్పష్టం చేశారు ప్రజల ప్రాణాలు భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొని రోడ్డు భద్రతపై ఆధార పొందారు అధికారులు వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై సూచనలు చేస్తూ భద్రత చర్యలు ప్రాముఖ్యతను వివరించారు

# గ్రామ సభలో ఒకే పంటకు పరిమితం కాకండి రైతులకు పంటల వై విధం పై అవగాహన నిర్వహించిన ఎమ్మార్వో

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్. 10** ఇందల్వాయి మండల కేంద్రంలోని స్టేషన్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సభను నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామ సభలో ఎమ్మార్వో మాట్లాడుతూ మంచి నీటి కొరత లేకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు అలాగే వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన రైతులకు పంట పై అవగాహన కల్పించారు ఒకే వరి పంటపై ఆధారపడకుండా మొక్కజొన్న జొన్న కందులు పెసర్లు మిమ్ములను వంటి పత్తి లాంటి పంటలను కూడా సాగు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు సర్వే నంబర్ 985 లో అంగన్వాడి కేంద్ర భవనం నిర్మాణం చేపట్టేందుకు గ్రామ సభ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకొని ఓటర్ హక్కును వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ ను కోరారు ఇందుకోసం ప్రత్యేక సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ గ్రామంలో ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు గ్రామ అభివృద్ధి ప్రజా సంక్షేమ వ్యవసాయ పురోగతికి సంబంధించిన అంశాలపై గ్రామసభలో విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు

# కోటగిరిమండలకేంద్రంలోప్రజాపాలనగ్రామసభ.



**కోటగిరి, జూన్ 10, ప్రజా జ్యోతి.** టగిరి మండల కేంద్రంలో కోటగిరి గ్రామపంచాయతీ నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం కోటగిరి గ్రామపంచాయతీ లో ప్రత్యేక గ్రామ సభను స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఏ కార్యక్రమాలు నిర్వహించారు వాటి గురించి వివరించారు ఇట్టి కార్యక్రమానికి కోటగిరి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు కుచి సిద్ధు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, ఎంపీడీవో విష్ణు, డిప్యూటీ తాసిల్దార్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ , ఎలక్ట్రిసిటీ ఏఈ, గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, ఏఎన్ఎం స్, అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, పాల్గొనడం జరిగింది.

# పీజీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

**నిజామాబాద్ రూరల్, ప్రజాజ్యోతి:** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జులై నెలలో జరిగే పీజీ 2, 4 సెమిస్టర్ల రెగ్యులర్/ 1, 3, 5 సెమిస్టర్ల బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27 తేదీలోపు చెల్లించాలని కంట్రోలర్ ఆచార్య సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుముతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ ఔవఎంజ్వ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

# గ్రామ సమస్యలపై దద్దరిల్లిన ప్రత్యేక గ్రామసభ

**పైప్‌లైన్ లీకేజీలు,కందకాల ఆక్రమణలు,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై గ్రామస్తుల గళం**

**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ**



**రుద్రూర్,జూన్ 10 (ప్రజా జ్యోతి):** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన ఈ గ్రామసభలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్‌లు లీకేజీ అవుతున్నాయని,దీని కారణంగా నీటి వృథాతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు.వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని కందకాలు,ప్రభుత్వ భూములు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని,సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు అందజేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.గ్రామాభివృద్ధికి సంబంధించిన మరిన్ని సమస్యలను కూడా సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, తహసీల్దార్ తారబాయి,ఇతర శాఖల అధికారులు మాట్లాడుతూ గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కందకాల ఆక్రమణలపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని,పైప్‌లైన్ లీకేజీలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు.అలాగే నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ నిస్సార్,ఎంపీడీవో బాల గంగాధర్,గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాత్విక, ఏవో సాయికృష్ణ,వివిధ శాఖల అధికారులు,వార్డ్ మెంబర్లు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,మహిళలు, యువకులు,గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

**ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల చేరికకు గ్రామస్తుల మద్దతు**

**గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం**

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందన్న నాయకులు**

**తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు**

**విద్యాభివృద్ధికి గ్రామస్థుల సహకారం అవసరమనీ పిలుపు**



**సిరికొండ ( ప్రజా జ్యోతి)జూన్** 10:గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో కొండాపూర్ గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మానస శ్రీధర్, ఉప సర్పంచ్ నాగుల రాజేశ్వర్ గౌడ్, గ్రామ వీడీసీ సభ్యులు ఆకుల జగన్, సామెల్, గ్రామ పెద్దలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని గ్రామస్తులతో కలిసి ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఇతర సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలు కల్పిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నాయకులు కోరారు.

గ్రామ అభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థులందరూ సహకరించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంత్ రెడ్డి ఒక గజదొంగ నా క్యారెక్టర్ మీద తప్పుడు అభాండాలు వేస్తే మీ బట్టలు విప్పి నడి బజారులో నిలబెడతా

**ప్రజాజ్యోతి, బాల్కొండ జూన్ 10**బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ లలితా గార్డెన్స్ లొ జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్స్ మరియు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ యస్ ఐ ర్ అవగాహన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి టీ పి సి సి కార్యక్రమ ఇంచార్జ్ నాగరాజు గౌడ్ తో కలిసి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు జరుగు (యస్ ఐ ర్ )కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏజెంట్స్ అప్రమత్తంగా ఉండాలని అకారణంగా ఏ ఒక్క ఓటు తొలగకుండా చూడాలని కోరారు.ప్రశాంత్ రెడ్డి ఎప్పుడు ఇసుక మీద పడి ఏడుస్తున్నాడు అసలు ఇసుక దందా చేసేది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తినడానికి అలవాటు పడ్డ ప్రశాంత్ రెడ్డి అండ్ కో ఇంకా అదే పని మీద ఉన్నారు.గతంలో ఒక ఊరికి నలుగురికి ఇసుక దందాను అప్పజెప్పి ప్రశాంత్ రెడ్డి మరియు ఆయన తమ్ముడు కోట్ల రూపాయలను జేబులో వేసుకున్నారు. అలాంటి నీచ పనులు కాంగ్రెస్ పార్టీ కానీ నేను కానీ చేయలేదు. ప్రశాంత్ రెడ్డి ఒక గజదొంగానే దొంగ పైసల తోటే ఆర్థికంగా వృద్ధి చెందాడని డబ్బులు పెట్టి ఓట్లు కొనుగోలు చేసి గెలిచానని విర్రవీగుతున్నాడని అన్నారు.

జిల్లా అధికారులకు ఫోన్ చేసి స్పీకర్ పెట్టి మాట్లాడి సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకోవడం అలవాటుగా మారిందని ఈయన వాలకం చూసిన అధికారులు ఫోనే లిఫ్ట్ చేయడం మానేసారని అన్నారు. వందల కోట్లు దోచుకున్న ప్రశాంత్ రెడ్డి




ఒక దొంగ అని ఆయనకు ప్రజల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదని దోచుకోవడం దాచుకోవడమే ఆయన ప్రధాన ఎజెండా అని అన్నారు.ఆయన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజలపై తప్పుడు కేసులు పెట్టారని ముక్కుపచ్చలారని పిల్లలపై కూడా వారి కుటుంబాలపై కక్షతో గంజాయి కేసులు పెట్టి చిత్రవధ చేశారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని నామినేటెడ్ పదవులు కష్టపడ్డ వారికె ఇస్తామని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజార్టీతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు,యువజన కాంగ్రెస్ నాయకులు,బూతు లెవెల్ ఏజెంట్లు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవి తాండ గ్రామ అభివృద్ధికి మరో అడుగు పంచాయతీ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మార్వో బాలయ్య



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్. 10** ఇందల్వాయి మండల కేంద్రంలోని దేవి తాండ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ కార్యాలయభవన నిర్మాణ కోసం సర్వే నెంబర్ 1223 లో స్థలాన్ని కేటాయించారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వాడు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనం ఎంతో అవసరమని భవన నిర్మాణానికి స్థలం కేటాయింపుతో ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందుబాటులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు గ్రామ ప్రజలు దీర్ఘకాలిక కోరిక నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్వో జీ బాలయ్య జిపిఓ గ్రామ అభివృద్ధి కమిటీ గ్రామ పెద్దలు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వాయంతో పని చేయాలని సూచించారు గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# నేత్రదానం మహాదానం. మరణం అనంతరం మిగతా దానం చేసి ఇద్దరు జీవితాల్లో వెలుగు..



**ప్రజా జ్యోతి బోధన్ జూన్. 10.** బోధన్ లైన్స్ క్లబ్ లో ఘనంగా నేత్రదానం మనిషి జీవితానికి కళ్ళు వెలుగైతే నేత్రదానం మరొకరి జీవితానికి కొత్త ఉదయం అనే సందేశంతో ప్రపంచ నేత్ర దాన దినోత్సవం బుధవారం రోజున లైన్స్ క్లబ్లోలో ఘనంగా నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా లైన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు సిబ్బంది సభ్యులు ప్రతిజ్ఞ చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు లైన్స్ జిల్లా మాది గవర్నర్ పోలవరపు బసవేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మరణం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఒక నీత్రదానం ద్వారా ఇద్దరు అందులకు చూపు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు సమాజంలో ఇంకా నేత దానంపై తొలగించాల్సిన అవసరం ఉందన్నారు

# -ఊరు చిన్నది బెల్ట్ షాపులు ఎనిమిది. బెల్లల్ గ్రామంలో మందు బాబులకు మహర్దశ...




**ప్రజా జ్యోతి బోధన్ జూన్. 10.** పోతన మండలంలోనిబే ల్లలు గ్రామం దేనితో వెనుకబడిందో లేదో ఏర్పాట్లు మాత్రం అద్భుతమైన అభివృద్ధిని సాధిస్తుంది షాపు చొప్పున సుమారు 8 బెల్ట్ షాపులు తెరిచి బెల్లల్ మొద్దని అమ్ముకుంటే మన బోధన్ ఎక్సైజ్ శాఖ అధికారులుమాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నట్టు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు అద్భుతంగా నటిస్తున్నారు ఆఫీసర్లు మండిపడుతున్నారు ఈ మందు బాబులు పగడాల భరించలేక ఎక్సైజ్ ఆఫీసుకు ముట్టడిస్తూ మేము ఆఫీసులో ఉన్నాం అంటే మేము అంటూ అధికారులు భలే కవర్ డ్రైవులు మహిళలు ఆరోపిస్తున్నారు ప్రస్తుత వెల్లాల్ చెరువు ఉన్న ఈ ఊర్లో పరిస్థితి అలాగే కొనసాగిందని ఇలాగే వెల్లలచెరువు నీళ్లు బదులు మద్యం తగడం మొదలవుతుంది అని గ్రామ స్థానికులు మేధావులు ఆరోపిస్తున్నారు.. తమ బతుకులను రోడ్డుపాలన పడకముందే ఎనిమిది బెల్ట్ షాపులను మూసివేయాలని మహిళలు ఆరోపిస్తున్నారు ఈ గ్రామంలో సారే వింత సారను ఆపే వారె అధికారులు కరువయ్యారా అనిగ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## గతంలో జరిగిన తప్పులు.. ఎంతో బాధ అనుభవించా: శ్రీజ కొణిదెల



మెగాస్టార్ చిరంజీవి చిన్నకూతురు శ్రీజ కొణిదెల తన కష్టాలపై తొలిసారి పెదవి విప్పింది. చాలాకాలంపాటు తను అనుభవించిన బాధను బయటకు చెప్పుకుంది. ఎట్టకేలకు ఆ బాధ నుంచి బయటకు వచ్చేశానంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో షేర్ చేసింది. "నాకే ఎందుకిలా జరుగుతోంది? ఎందుకింత బాధ అనుభవిస్తున్నాను? ఒకదాని వెంట మరొకటి వరుసగా కష్టాలు చుట్టుముడుతున్నాయేంటి? నేనేం పాపం చేశానని ఇంత క్షోభ అనుభవిస్తున్నాను? అని చాలారోజులు నాలో నేనే మథనపడ్డాను. నేను బాధితురాలిని అని బాధపడుతూ కూర్చున్న నేను నెమ్మదిగా ఆ భావన నుంచి బయటకు వచ్చాను. మన జీవితమేంటి.. ఇలా ఉంది! అని బాధపడటానికి బదులుగా దాన్ని మార్చుకునేందుకు ఏం చేయగలం? అని తెలుసుకోవడమే అసలైన మార్పు అని తెలుసుకున్నాను. 'సెల్ఫ్ మాస్టరీ ప్రాజెక్ట్' వల్ల నాలో ఆ మార్పు మొదలైంది. నా ఆలోచనల్లో క్లారిటీ వచ్చింది. జీవితం ప్రశాంతంగా మారింది. నేనేంటో తెలుసుకున్నాను. ఒకప్పుడు నా లైఫ్‌లో జరిగిన తప్పులే నా గుర్తింపును నిర్ధారించాయనుకున్నాను. కానీ, అది తప్పని తెలుసుకున్నాను. బాధ నాలో ఒక భాగమే కానీ, అదే జీవితం కాదని తెలిసొచ్చింది. మనిషిలో ఇంకా ఎన్నో లేయర్స్ ఉంటాయి. వాటిని ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ ఉంటుంటే చాలా బాగుంది" అని చెప్పుకొచ్చింది. ఒకప్పుడు గుండె లోతుల్లో బాధను అనుభవించిన తాను ఇప్పుడు మానసికంగా ఆరోగ్యంగా ఉన్నానంది. ఈ పోస్ట్‌కు నిహారిక కొణిదెల స్పందిస్తూ.. "మై సూపర్ ఉమెన్" అని కామెంట్ పెట్టింది. శ్రీజ కొణిదెల 2007వ సంవత్సరంలో శిరీష్ భరద్వాజ్‌ను పెళ్లి చేసుకుంది. ఏడాది తిరిగేలోపు వీరికి కూతురు నివృతి జన్మించింది. కానీ కొంతకాలానికే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. 2011లో భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టి పుట్టింటికి తిరిగొచ్చేసింది. 2014లో వీరికి విడాకులు మంజూరయ్యాయి. 2016లో నటుడు కల్యాణ్ దేవ్‌ను రెండో పెళ్లి చేసుకుంది శ్రీజ. వీరికి 2018లో కూతురు నవిష్క జన్మించింది. కానీ ఈ దాంపత్య జీవితం కూడా ఎంతోకాలం సాగలేదు. 2022లో వీరు విడిపోయారు.

## బాక్సాఫీస్ వద్ద రామ్ చరణ్ జోరు .. వర్కింగ్ డేలోనూ బుక్ మై షోలో రికార్డ్ టిక్కెట్ సేల్స్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ డ్రామా పెద్ది బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి వారంలోనే భారీ వసూళ్లతో ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది.గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. కొన్ని వర్గాల నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ఆ ప్రభావం కలెక్షన్లపై మాత్రం కనిపించడం లేదు. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ మంచి ఆక్యుపెన్సీ నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.315 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రాల్లో ఒకటిగా నిలిచే దిశగా సినిమా అడుగులు వేస్తోంది. ఇక సినిమా క్రేజ్‌కు నిదర్శనంగా బుక్‌మైషోలో నమోదవుతున్న టికెట్ సేల్స్ నిలుస్తున్నాయి. గత 24 గంటల్లోనే 1.27 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. సాధారణంగా వర్కింగ్ డే అయిన బుధవారం రోజున కూడా ఈ స్థాయి బుకింగ్స్ నమోదు కావడం విశేషంగా మారింది. ఇది ప్రేక్షకుల్లో సినిమాపై ఉన్న ఆసక్తిని స్పష్టంగా తెలియజేస్తోంది. పాజిటివ్ మౌత్ పబ్లిసిటీ కూడా సినిమాకు ప్రధాన బలంగా మారింది. ఇప్పటికే సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటుండటంతో మరింత మంది థియేటర్లకు వస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ఏరియాల్లో సినిమా త్వరలోనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ను చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ వారం పెద్ద సినిమాల విడుదలలు లేకపోవడం కూడా 'పెద్ది'కి అదనపు ప్రయోజనంగా మారింది. దీంతో రెండో వారంలోనూ బలమైన వసూళ్లు నమోదు చేసే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. వృద్ధి సినిమాస్ నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు.




## యాక్షన్‌తో అదరగొట్టిన అలియా భట్.. 'ఆల్ఫా' టీజర్ రిలీజ్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌ఫైట్లు, ఫైటింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది. మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'తుంబాడ్' దర్శకుడి నెక్ట్స్ లెవెల్ ప్లాన్: ఒకేసారి రెండు భారీ చిత్రాల ప్రకటన.. రిలీజ్ ఇయర్స్‌తో సహా!




'తుంబాడ్' చిత్రంతో దేశవ్యాప్తంగా సినీ ప్రియులను తనవైపు తిప్పుకున్న దర్శకుడు రాహి అనిల్ బర్వే తన తదుపరి ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కీలక అప్‌డేట్ ఇచ్చారు. విలక్షణమైన కథాంశాలు, విజువల్ వండర్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే ఈ దర్శకుడు.. తాజాగా రెండు కొత్త సినిమాలను అధికారికంగా ప్రకటిస్తూ వాటి టైటిల్స్ మరియు విడుదల కానున్న సంవత్సరాలను వెల్లడించారు. గతంలో 'తుంబాడ్' (2018) సినిమా ద్వారా "తండ్రి, కొడుకుల దురాశ" అనే కాన్సెప్ట్‌తో పితృస్వామ్య వ్యవస్థ చక్రం ఎలా తిరుగుతుందో అద్భుతంగా చూపించిన రాహి అనిల్ బర్వే, ఇప్పుడు అంతకంటే విభిన్నమైన కథాంశాలతో ముందుకు వస్తున్నారు. ఆయన ప్రకటించిన రెండు కొత్త ప్రాజెక్ట్‌లను ఒకసారి చూసుకుంటే. దేవుళ్లు, పురుషులతో పాటు మొట్టమొదటి ధైర్యవంతురాలైన మహిళ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు. విముక్తి యొక్క ఆరంభం, స్త్రీవాదం (ఫెమినిజం) పుట్టుక నేపథ్యంతో సాగే ఈ విలక్షణ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. పురుషుడు, స్త్రీ మరియు సృష్టి యొక్క చివరి సాక్షి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. పురాణాల్లోని ప్రసిద్ధ 'కాకభుషుండి' పక్షికి సంబంధించిన ఒక చీకటి గాథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ 2030లో విడుదల కానుంది. భారతీయ చలనచిత్ర రంగంలో సరికొత్త ప్రయోగాలకు వేదికగా నిలిచే రాహి అనిల్ బర్వే నుంచి వస్తున్న ఈ రెండు ప్రకటనలు చూస్తుంటే, ఆయన ప్రేక్షకులకు మరోసారి వెండితెరపై ఒక అద్భుతమైన కాన్సెప్ట్ ఆధారిత ప్రపంచాన్ని చూపించబోతున్నట్లు స్పష్టమవుతోంది. దాంతో ఈ ప్రాజెక్ట్‌లపై ఇండస్ట్రీలోనూ, ప్రేక్షకుల్లోనూ అప్పుడే భారీ అంచనాలు మొదలయ్యాయి. ఇవే కాకుండా రాహి అనిల్ బర్వే 'ఫ్యామిలీ మ్యాన్' దర్శకులతో కలిసి రక్తబ్రహ్మాండ్ అనే వెబ్ సిరీస్ తెరకెక్కిస్తున్నాడు. ఇందులో సమంత కథానాయికగా నటిస్తుండగా.. ఆదిత్య రాయ్ కపూర్, అలి ఫజల్, వామిఖా గబ్బీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# టాక్సిక్ రిలీజ్‌పై షాకింగ్ బజ్.. అక్టోబర్‌కు వాయిదా పడిన యష్ పాన్ ఇండియా మూవీ?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బడ్జెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా వినిపిస్తున్న బలమైన బజ్ ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది. అయితే పండుగల సీజన్‌ను టార్గెట్ చేస్తూ అక్టోబర్‌లో విడుదల చేస్తే సినిమాకు మరింత భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఈ భారీ చిత్రానికి సంగీత సంచలనం రవి బస్రూర్ స్వరాలు అందిస్తున్నారు. కేజీఎఫ్ సినిమాలతో తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన, టాక్సిక్‌కు కూడా ప్రత్యేకమైన సంగీతాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. యష్‌తో పాటు కేవీఎన్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా యాక్షన్, ఎమోషన్, స్టైలిష్ విజువల్స్ కలగలిసిన విభిన్న అనుభూతిని అందించనుందని సమాచారం.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967